# వినాయక నిమజ్జనంలో విషాదం

**ట్రాక్టర్ ముందు చక్రాలు పైకెత్తడంతో చిన్నారి మృతి..మరో ముగ్గురికి గాయాలు**



**ధర్మవరం,సెప్టెంబర్ 18 (పెన్ సత్తా )**వినాయక నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. ధర్మవరం పట్టణంలోని శారదానగర్ నుంచి వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకెళ్తుండగా శుక్రవారం కదిరిగేట్ సమీపంలో ప్రమాదం జరిగింది.ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం ముందు చక్రాలను పైకెత్తడంతో ముందు నృత్యం చేస్తున్న నలుగురిపై వాహనం దూసుకెళ్లింది.ఈ ఘటనలో వర్షిత (9) అనే చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా,మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు టూటౌన్ సీఐ జయ నాయక్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# రూ.85 వేలు పలికిన వినాయకుడి లడ్డూ



**ధర్మవరం,సెప్టెంబర్ 18 (పెన్ సత్తా)**శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని 16వ వార్డు సచివాలయం వెనుక శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడి లడ్డూ, రెండు వెండి కాయిన్లకు వేలంపాట నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేలంపాటలో స్వామివారి మహాప్రసాదమైన లడ్డూను పోల రామకృష్ణయ్య (సీఏ) రూ.85,000 వేల కు దక్కించుకున్నారు. అదేవిధంగా మొదటి వెండి కాయిన్‌ను పరిసే నారప్ప కుమారుడు పరిసే నరసింహులు రూ.70,116 వేల కు, రెండో వెండి కాయిన్‌ను జక్కా చిన్న సింగరయ్య కుమారుడు జక్కా శ్రీనాథ్ రూ.73,121 వేల కు వేలంలో దక్కించుకున్నారు.

వేలంపాటలో విజేతలుగా నిలిచిన పోల రామకృష్ణయ్య, పరిసే నరసింహులు, జక్కా శ్రీనాథ్‌లను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు.

# పెరిగిన వార్డులకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలి

**ధర్మవరం,సెప్టెంబర్ 18 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ లో పెరిగిన వార్డుల సంఖ్యకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే రిజర్వేషన్ సీట్ల సంఖ్యను పెంచాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేష్ కోరారు.ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దేవరకొండ రమేష్ మాట్లాడుతూ,మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ధర్మవరం మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్ సీట్లను కూడా పెంచాలని కోరారు.గతంలో 32 వార్డులు ఉన్న సమయంలో ఎస్సీలకు రెండు, ఎస్టీలకు ఒక వార్డు చొప్పున రిజర్వేషన్ కల్పించారని తెలిపారు.ప్రస్తుతం ధర్మవరం మున్సిపాలిటీ గ్రేడ్-1 మున్సిపాలిటీగా మారి వార్డుల సంఖ్య 48కు పెరిగిన నేపథ్యంలో ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు మూడు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన వార్డులకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచడం ద్వారా ఎస్సీ,ఎస్టీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం. చౌడప్ప,ఎస్సీ సెల్ రూరల్ అధ్యక్షుడు కునుతూరు గోపాల్, బత్తుల నాగార్జున, పి. కుళ్లాయప్ప,పి. శ్రీనివాసులు,సాకే వెంకటేష్,నామాల రామాంజినేయులు, వెంకటరమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో పేదల భూములకు హక్కుల పంపిణీకి సర్వం సిద్ధం

- రేపు ముఖ్యమంత్రి చే కన్వేయన్స్ డీడ్ల అందజేత
- జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**విశాఖపట్నం, (పెన్ సత్తా)** విశాఖ నగర పరిధిలోని పేద ప్రజలకు వారు నివసిస్తున్న భూములపై శాశ్వత హక్కులు కల్పిస్తూ కన్వేయన్స్ డీడ్లను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి ఎన్డీయే (చీణూ) ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయ మరియు గ్రామ వాలంటీర్ శాఖ మాత్యులు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు డోల బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖ జిల్లా పర్యటన సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్ లో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం శుక్రవారం సాయంత్రం పత్రిక ప్రతినిధులతో జిల్లా ఇన్చార్జి మంత్రి సమావేశం అయ్యారు.

**జిల్లా ఇన్చార్జి మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.....**

విశాఖలో పేదల భూములకు హక్కుల పంపిణీకి సర్వం సిద్ధం చేయడం జరిగిందని, రేపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా వైభవంగా కన్వేయన్స్ డీడ్ల అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పంపిణీ ద్వారా విశాఖపట్నంలోని దాదాపు 28,500 మందికి పైగా నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నట్లు ఉన్నట్లు తెలిపారు.

2014-2019 కాలంలో నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోల ఆధారంగా పేదలకు భూహక్కులు కల్పించాల్సి ఉండగా, గత ప్రభుత్వం ఈ ప్రక్రియను పక్కన పెట్టి కన్వేయన్స్ డీడ్ల పంపిణీని నిలిపివేశారని విమర్శించారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ. 8,500 కోట్లు, మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ. 15,000 కోట్ల విలువైన భూమిపై పేదలకు సర్వహక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ డీడ్ల ఆధారంగా లబ్ధిదారులు తమ అవసరాల కోసం బ్యాంకుల నుండి రుణాలు పొందే వెసులుబాటు కూడా కలుగుతుందని వివరించారు.

లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంపిణీ ప్రాంతంలో విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 100 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ప్రతి కౌంటర్ వద్ద ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి కౌంటర్ ద్వారా 300 మందికి ఇబ్బంది లేకుండా డీడ్లు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు. వేలిముద్రల సేకరణ నుండి పత్రాల అందజేత వరకు ప్రక్రియ సులభంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారని , ఈ సదవకాశాన్ని లబ్ధిదారులందరూ క్రమ శిక్షణతో వినియోగించుకోవాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ విప్ పి జి వి ఆర్ నాయుడు మాట్లాడుతూ......**

విశాఖలో నిరుపేదల భూములకు క్రమబద్ధీకరణ కన్వేయన్స్ డీడ్లతో శాశ్వత హక్కుల కల్పన

గతంలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేద, మధ్యతరగతి వర్గాలకు కేవలం పరిమిత హక్కులు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వంలో వారికి జిరాయితీ భూముల తరహాలో సంపూర్ణ హక్కులు కల్పిస్తూ కన్వేయన్స్ డీడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే పట్టాలు, అసైన్డ్ భూములు లేదా డి-పట్టాలకు బదిలీ హక్కులు ఉండేవికాదని, కేవలం అనుభవించే హక్కు మాత్రమే ఉండేదని గుర్తుచేశారు. అయితే, 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిరుపేదలకు, మధ్యతరగతి వర్గాలకు శాశ్వత భూహక్కులు కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. జీవో 296 ద్వారా 100 గజాల లోపు స్థలాల్లో నివసించే నిరుపేదలకు ఉచితంగా క్రమబద్ధీకరణ, జీవో 388 ద్వారా 100 గజాల పైబడి ఉన్న స్థలాలకు నామమాత్రపు ధర నిర్ణయించి మధ్యతరగతి వర్గాలకు క్రమబద్ధీకరణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పట్టా పొందిన రెండేళ్ల తర్వాత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో కన్వేయన్స్ డీడ్ ద్వారా సంపూర్ణ హక్కులతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించామని అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకం నిలిచిపోయిందని, విశాఖపట్నంలో వేలాది మంది ఆర్డీఓ, రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నగర ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా జిఓ నంబర్ 30 ని విడుదల చేసి, పేదల భూములకు శాశ్వత హక్కులు, క్రమబద్ధీకరణ పత్రాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు.

**శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ....**

విశాఖపట్నంలో 28 వేల మంది పేదలకు సంపూర్ణ భూహక్కులు

విశాఖ నగర పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలకు దశాబ్దాల కాలంగా నెరవేరని సొంతింటి భూమి కల ఎన్డీయే ప్రభుత్వంతో సాకారమవుతోందని తెలిపారు. ఆంధ్ర ప్రాంత పేదల భూములకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పిస్తూ కన్వేయన్స్ డీడ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి సర్వం సిద్ధమైందని, రేపు (సెప్టెంబర్ 19) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైభవంగా జరగనున్న బహిరంగ సభలో ఈ హక్కు పత్రాలను లబ్ధిదారులకు స్వయంగా అందజేస్తారని తెలిపారు. సాధారణంగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి గతంలో ఇచ్చిన డి-పట్టాలు, అసైన్డ్ పట్టాలకు ఎలాంటి అమ్మకపు లేదా బ్యాంకు రుణాల హక్కులు ఉండేవి కావు. కానీ, 2014-19 మధ్యకాలంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 296, జీవో 388 మరియు ఇతర ఉత్తర్వుల ద్వారా పేదలకు రెండేళ్ల తర్వాత కన్వేయన్స్ డీడ్ల రూపంలో జిరాయితీ తరహా సంపూర్ణ హక్కులు కల్పించే వెసులుబాటు తెచ్చిందని, గత ప్రభుత్వం ఈ ప్రక్రియను పక్కనబెట్టగా, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నంబర్ 30 ని జారీ చేసి ఈ ప్రక్రియను వేగవంతం చేసిందని పేర్కొన్నారు.

# అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పోలీసుల అవగాహన




**మాకవరపాలెం, (పెన్ సత్తా)** మాకవరపాలెం మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేరాల నియంత్రణ, చట్టాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్ నాయుడు విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు చేశారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం 'శక్తి' యాప్‌ను వినియోగించాలని, అత్యవసర సమయంలో ఎస్వోఎస్ ద్వారా పోలీసు సహాయం పొందవచ్చని సీఐ వివరించారు. సుమారు 350 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ బరిలో రామవరం విద్యార్థి రేవంత్



**ఆనందపురం, (పెన్ సత్తా)** రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్. రేవంత్ సాఫ్ట్‌బాల్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విజయనగరం జిల్లాలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన సబ్‌జూనియర్స్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రేవంత్ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి. మహారాష్ట్రలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సహాయంగా రామవరం గ్రామ సర్పంచి వై. పైడిరాజు రేవంత్‌కు రూ.5 వేల ఆర్థిక సహకారం అందించారు. జాతీయ స్థాయిలోనూ రేవంత్ ప్రతిభను చాటుకుని పాఠశాల, గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బి. వరలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్. రామచంద్రరావుతో పాటు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## ముకుందపురంలో ఉచిత వైద్య సేవలు



**ఆనందపురం, (పెన్ సత్తా)** ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముకుందపురంలో శుక్రవారం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 40 మంది హాజరై వైద్య సేవలు పొందారు.శిబిరంలో గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. రక్తపోటు, మధుమేహం, వివిధ రకాల క్యాన్సర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక బరువుతో ఉన్న వారిని గుర్తించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలపై వైద్య సిబ్బంది సూచనలు చేశారు.కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాదియా, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య, ఏఎన్ఎం ప్రమీలా రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ స్టేడియం అభివృద్ధికి రూ.45 లక్షలు



**అనకాపల్లి, (పెన్ సత్తా)** పరవాడ క్రీడా వికాస కేంద్రం (కేవీకే) వద్ద రూ.45 లక్షల అంచనా వ్యయంతో క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. శుక్రవారం స్టేడియం ప్రహరీ గోడ, వాలీబాల్ కోర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు.క్రికెట్ గ్రౌండ్‌లో పొదలు తొలగించడం, భూమిని చదును చేయడం, కంకర నింపి పిచ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. విశాఖ ఫార్మా లిమిటెడ్ (రామ్‌కీ) సీఎస్ఆర్ గ్రాంట్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి పూజారి శైలజ, అధికారులు, రామ్‌కీ ప్రతినిధులు పాల్గొన్నారు.

